ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కేంద్ర బడ్జెట్‌లో...

విశాఖకు మొండిచెయ్యి?



- రైల్వే జోన్ ప్రస్తావన లేదు...
- మెట్రో చాప చుట్టేసినట్టే!
- స్టీల్‌ప్లాంట్‌కు రూ.683 కోట్లు మోసపూరితం : అయోధ్యరాం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర బడ్జెట్ అందరూ ఊహించినట్టుగానే విశాఖపట్నంకు మొండిచెయ్యి చూపింది. బడ్జెట్ తుది ప్రతులు చేతికందితే గానీ ఇంకా ఏమేమి షాకింగ్ న్యూస్‌లు ఉంటాయన్నది చెప్పలేమన్నది సిఐఐ సమావేశంలో కొంతమంది ప్రతినిధులు వెల్లడించారు. విశాఖ ప్రాంత ప్రజలు ఏనాటినుంచో కలలు గంటున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ విషయం ఈ బడ్జెట్‌లో ప్రస్తావన గానీ, నిధులకు సంబంధించిన కేటాయింపులు చేయలేదు. మెట్రో రైలుకు అతీగతీ లేదు. దీని ప్రస్తావన కూడా కేంద్ర బడ్జెట్‌లో లేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం విశాఖను రాజధాని చేసేస్తామంటూ త్వరలో పాలన ప్రారంభిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగమైన మెట్రో రైలు, ఫ్లై ఓవర్‌లు, రైల్వే జోన్ వంటి అంశాల ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. సిజిహెచ్‌ఎస్ ఆసుపత్రికి నిధులు, పనుల సంగతిని కూడా బడ్జెట్ పట్టించుకోలేదు. పోలవరానికి నిధుల కేటాయింపులు వంటి జోలికి వెళ్లలేదు. దీంతో విశాఖ నగరాభివృద్ధిని ప్రభావితం చేసే విషయాలను కేంద్రం పట్టించుకోకుండా బడ్జెట్ ఉందన్నది స్పష్టమవుతోంది.

స్టీల్‌ప్లాంట్‌పై మోసపూరిత ప్రకటన: అయోధ్యరాం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం అంటూ బిజెపి సర్కారు ప్రకటించిన నుంచీ

మిగతా 2లో..

ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్ : సిపిఎం

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకమైనదని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ధరలు పెరిగి, నిరుద్యోగం తీవ్రమై, వ్యవసాయ రంగం కునారిల్లుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వీటికి పరిష్కారం చూపించే విధంగా బడ్జెట్ లేదని, కాకులను కొట్టి గెద్దలకు వేసేలా ప్రజల సంపదను కార్పొరేట్లకు

మిగతా 2లో..

మృత్యు ఫార్మా

- ఆగని పరిశ్రమ ప్రమాదాలు
- చనిపోతున్న కార్మికులు
- భద్రతను విస్మరిస్తున్న యాజమాన్యాలు



జిఎంఎఫ్‌సి ల్యాబ్‌లో పేలిన రియాక్టర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఫార్మా కంపెనీల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో కార్మికులు దుర్మరణం చెందుతున్నారు. కంపెనీల్లో కార్మికుల భద్రతకు యాజమాన్యం కనీస శ్రద్ధతీసుకోని ఫలితంగా ప్రమాద మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలో పరవాడ ఫార్మాలోని లారస్ ల్యాబ్ మూడో యూనిట్, ఆరో బ్లాకులో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతిచెందారు. ఇక్కడ ఔషధ పౌడర్ శుద్ధికి ఉపయోగించే టోలిన్ లీకై స్థిర విద్యుత్ ఉత్పత్తి జరగడంతో వ్యాపించిన మంటల్లో కార్మికులు మరణించారు. పైప్‌లైన్ నిర్వహణ సక్రమంగాలేదని ప్రమాదంపై పరిశ్రమలశాఖ అధికారులు నిర్వహించిన విచారణలో గుర్తించారు. అచ్యుతాపురం సెజ్‌లోని జిఎంఎఫ్‌సి ల్యాబ్‌లో మంగళవారం రియాక్టర్ పేలిన ఘటనలో కార్మికుడు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. హెచ్‌డిపిఇ పైప్‌లైన్ ద్వారా మిథనాల్‌ను రియాక్టర్‌లోకి పంపిస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. హెచ్‌డిపిఇ డ్రమ్, పైపులకు బదులు స్టెయిన్‌లెస్ స్టీల్ డ్రమ్, పైపులు యాజమాన్యం ఉపయోగించలేదు. దీనికారణంగా జిఎంఎఫ్‌సిలో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. అంతకుముందు నక్కపల్లి హెటిరో డ్రగ్స్‌లో రియాక్టర్ పేలి ఒకరు చనిపోగా, నలుగురు గాయపడ్డారు. ఫార్మాసిటీలోని సాయినార్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో

మిగతా 2లో..

ముగిసిన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సదస్సు

▶ వార్త మెయిన్‌లో..

సమ్మిట్ల పేరుతో తోపుడు బండ్ల తొలగింపు ఆపాలి

▶ వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్ మిగులు భూములు నిర్వాసితులకివ్వాలి

▶ వార్త 8లో..

ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరిచారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మార్చి 3,4వ తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు సంబంధించి మంగళవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన జరిగిన సన్నాహక సమావేశానికి సంబంధించిన వివరాలను మంత్రి అమర్‌నాథ్ బుధవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌తో సత్సంబంధాలు కలిగిన వివిధ దేశాల అంబాసిడర్లు, 49 దేశాలకు చెందిన ప్రతినిధులు, అసోచామ్, ఫిక్కీ, సిఐఐ, నాస్కామ్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. ఏపీలో పారిశ్రామిక రంగం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందన్న విషయాన్ని రాష్ట్రానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, ఈ సదస్సుకు హాజరైన ప్రతినిధులకు వివరించారని, ఏపీలో ఉన్న వనరుల గురించి అతిథులకు తెలియజేశారని, దీంతో ఆంధ్రప్రదేశ్‌పై వారికున్న నమ్మకం మరింత బలపడిందని, దేశంలో 8వ అతిపెద్ద రాష్ట్రం గా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు సుముఖత వ్యక్తం చేశారని మంత్రి వివరించారు. జిఎస్డీపీలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, గత ఏడాది 19 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించిందని, నీతి ఆయోగ్ వంటి సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక విధానాన్ని అభినందిస్తోందన్న విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వివిధ దేశాల ప్రతినిధులకు తెలియజేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో

మిగతా 2లో..

పిపిపికే ముడసర్లోవ

పూర్ణ మార్కెట్‌పై వెనక్కి తగ్గిన అధికార పక్షం
జివిఎంసి కౌన్సిల్‌లో 120 అంశాలు ఆమోదం



కౌన్సిల్‌లో పలు అంశాలపై ప్రశ్నిస్తున్న సిపిఎంకార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి సర్వసభ్య సమావేశం ప్రధాన కార్యాలయంలోని మీటింగ్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో 98 వార్డులలో భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాల యొక్క 104 సాధారణ అంశాలు 16 టేబుల్ ఎజెండా అంశాలు, 1 అనుబంధ అంశంతో మొత్తం 121 అంశాలపై సమీక్ష నిర్వహించారు. వీటిలో 120 అంశాలను ఆమోదించగా హార్టికల్చర్ విభాగానికి సంబంధించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు అంశాన్ని వాయిదా వేశారు. ప్రతి పక్ష

మిగతా 2లో..

పూర్ణామార్కెట్, ముడసర్లోవ భూములు ప్రైవేట్‌కు వద్దంటూ సిపిఎం, సిపిఐ నిరసన

వార్త 8లో..

నిధులు వృథా సరికాదు : గంగారావు

నగరంలోని వార్డుల్లో కనీస మౌలికసదుపాయాల అభివృద్ధికి నిధుల కొరత ఉన్న సమయంలో జి-20, గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు పేరుతో జివిఎంసి నిధులను వృథా చేయడం సరికాదని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు లేవనెత్తారు. దీనిపై జివిఎంసి కమిషనర్ బదులిస్తూ జి-20 కి సంబంధించిన అభివృద్ధి పనులకు నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వస్తాయని తెలిపారు. 15 ఆర్థిక సంఘం నుంచి 2022 సంవత్సరానికి గానూ చేపట్టిన రూ.76 కోట్లకు సంబంధించిన పనులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు విడుదల అయ్యాయో తెలపాలని గంగారావు డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ రూ.73 కోట్లు వచ్చినట్లు తెలిపారు. జోన్ -2 లోని 12వ వార్డులో హెల్త్ సిటీ లే-అవుట్‌లో ఉన్న ఖాళీ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు తూర్పు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రతిపాదన చేయగా ఇండోర్ స్టేడియం అయితే కొంతమంది మాత్రమే ఆడుకునేందుకు వీలుగా ఉంటుందని అలా కాకుండా ఓపెన్ గ్రౌండ్ ఏర్పాటుచేస్తే చుట్టుపక్కల పిల్లలంతా ఆడుకునేందుకు అవకాశం కల్పించే వాళ్ళమవుతామని గంగారావు సూచించారు.

మొదటి పేజీ తరువాయి..

పిపిపికే ముడసర్లోవ

పార్టీలు నిరసన తెలిపిన సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్ (పూర్ణా మార్కెట్)ను పిపిపి పద్ధతిలో కాకుండా జివిఎంసి నిధులతోనే అభివృద్ధి చేయుటకు సభ తీర్మానించింది.

కౌన్సిల్ సమావేశంలో ప్రధానంగా జి-20 సమావేశాలకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులు రానున్న సందర్భంగా విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ఎయిర్ పోర్ట్ నుంచి ఎన్ఎడి కొత్త రోడ్, తాటిచెట్లపాలెం రైల్వే స్టేషన్ మీదుగా సిరిపురం బీచ్ రోడ్ లోని నోవాటెల్ హోటల్ వరకు ఉన్న ప్రాంతమంతా రోడ్లు, మొక్కలు, పెయింటింగ్‌తో సుందరంగా తీర్చిదిద్దాలని, మరొక రోడ్డు బీచ్ రోడ్ గుండా ప్రయాణిస్తూ రాడిసన్ బ్లూ నుంచి భీమిలి, తొట్లకొండ వరకు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించి ఆమోదించారు.

సమావేశంలోని ఎజెండాలో సుమారు 40 అంశాలు విశాఖలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీ, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రతిపాదించి ఆమోదించగా, రెండో ప్రధాన అంశంగా నగరంలోని శ్మశానవాటికలను అభివృద్ధిపై ప్రతిపాదనలు చేసి ఆమోదించారు.

ముడుసర్లోవ పార్కును పిపిపి పద్ధతిలో ఎమ్యూజ్‌మెంట్, థీమ్ పార్క్‌గా అభివృద్ధి చేయుటకు ప్రతిపాదించిన అంశంపై టిడిపి, జనసేన, బిజెపి, సిపిఎం, సిపిఐ తీవ్రంగా వ్యతిరేకించాయి. ఒకానొక సమయంలో వైసిపి సభ్యులు, ప్రతి పక్ష పార్టీ సభ్యులు ఒకరినొకరు తోసుకుంటూ మేయర్ పోడియం వద్ద ఘర్షణకు దిగటంతో మార్షల్స్ సహాయం తో వారిని సముదాయించారు. ఈ ప్రతిపాదన వల్ల 283.2 ఎకరాల జివిఎంసి భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతులకు వెళ్లి ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయని, అక్కడ ఉన్న రిజర్వాయర్ నగరంలోని లక్ష మంది ప్రజలకు దాహార్తిని తీరుస్తుంటే దానిని నాశనం చేసి ప్రైవేటు భాగస్వామ్యంతో సినిమాహాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్, పబ్‌లు వంటివి నిర్మించడం సరికాదని వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిపై ప్రతిపక్ష పార్టీలన్నీ మేయర్ పోడియం వద్దకు వెళ్లి తీవ్ర నిరసనను తెలియజేసినప్పటికీ ఓటింగ్ విధానంలో 45 ఓట్ల మెజారిటీతో ఈ అంశాన్ని మేయర్ ఆమోదించారు. ఎజెండాలో లేని ప్రజా సమస్యలను ప్రస్తావించే జీరో అవర్‌ను ఈసారి నిర్వహించలేదు.

మీడియాపై ఆంక్షలు

జివిఎంసి సమావేశంలో మీడియాపై అధికారులు తీవ్రమైన ఆంక్షలు విధించారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కెమెరాలను లోపలికి తీసుకురావద్దని సూచించడంతోపాటు ఎప్పుడూ కౌన్సిల్ సమావేశాల్లో మీడియా ప్రతినిధులు కేటాయించే ప్రదేశంలో కుర్చీలు తీసివేసి విజిటర్స్ గ్యాలరీలో కూర్చోవాలని, కేవలం ప్రింట్ మీడియా ప్రతినిధులు మాత్రమే సమావేశ మందిరంలో ఉండాలని చెప్పడంతో సభ ప్రారంభంలో మీడియా ప్రతినిధులంతా సభను బాయ్ కట్ చేసి బయటకు వెళ్లి పోయారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరం తెలపడంతో మీడియా ఎప్పుడూ కూర్చున్న ప్రాంతంలో కేవలం 10 కుర్చీలు మాత్రమే ఏర్పాటు చేసారు. ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్లను లోపలికి అనుమతించకపోగా మొబైల్ ఫోన్‌లో కూడా వీడియో తీయరాదని ఆంక్షలు విధించారు.

మొదటి పేజీ తరువాయి..

కేంద్ర బడ్జెట్‌లో... విశాఖకు మొండిచెయ్యి?

రెండేళ్లుగా అప్రతిహితంగా కార్మికవర్గం పోరాడుతున్న క్రమంలో రూ.683 కోట్లు కేటాయిస్తున్నట్లు ఈ బడ్జెట్‌లో పేర్కొనడం జరిగింది. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జెఅయోధ్యారాం ఈ అంశంపై స్పందిస్తూ... ప్రతి బడ్జెట్‌లో కేటాయింపులు పెడతారు. ప్లాంట్ వద్ద ఉంటే ఖర్చుచేస్తారు' అంతేగానీ గడచిన 9ఏళ్లలో బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు బడ్జెట్ నుంచి ఒక్కపైసా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం నిధులివ్వనవసరం లేదు.. కనీసం బ్యాంకుల నుంచి తెచ్చుకుని ప్లాంట్ తీర్చడానికి గ్యారెంటీ, అనుమతులివ్వడం లేదని పేర్కొన్నారు. ఎగ్గొట్టిన అదానీ వంటి వారికి బ్యాంకులకు మోడీ ప్రభుత్వం గ్యారెంటీలిస్తుందని, ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ఇవ్వడం లేదని పైపెచ్చు రూ.683కోట్లు 'మా సొమ్మును మేం ఖర్చుపెట్టుకునే ప్రణాళికకు' బడ్జెట్‌లో చేర్చి చూపించడం మోసపూరిత చర్యగా తప్పుపట్టారు.

ప్రజా వ్యతిరేకమైనది : సిపిఎం

దోచిపెట్టే విధంగా ఉందని విమర్శించారు. 4 రాష్ట్రాల శాసన సభలకు జరిగే ఎన్నికల్లో బిజెపి లబ్ధిపొందే రాజకీయ బడ్జెట్‌గా ఉందని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర, విశాఖ ప్రజలను తీవ్ర నిరాశ నిస్పృహలకు గురిచేసిందని, విశాఖ రైల్వేజోన్, ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని తెలిపారు. విభజన చట్టంలో ఉన్న గిరిజన యూనివర్సిటీకి నిధులు గత బడ్జెట్ కంటే 15శాతం తగ్గించారని, ఆహారం, ఎరువులపై సబ్సిడీ తగ్గించారని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధిహామీకి గత బడ్జెట్‌లో 25శాతం తగ్గిస్తే ఈ బడ్జెట్‌లో 33 శాతం కోత విధించడం ద్వారా గ్రామీణ పేదలు ఉపాధికి దూరమవుతారని తెలిపారు. పట్టణాల్లో యూజర్ ఛార్జీలు వసూళు చేయాలని బడ్జెట్‌లో ప్రస్తావించడం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

మృత్యు ఫార్మా

ముగ్గురు కార్మికులు మృతిచెందారు. స్మైల్ ఎక్స్ కంపెనీలో గతంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు. అలాగే బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలో సీడ్స్ కంపెనీలో 2022 జూన్ మూడున, ఆగస్టు 2న విష వాయువులు లీకవడంతో 539 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారు. ఫెర్రోఎల్లాయిస్ కంపెనీలో ప్రమాదాలు నమోదయ్యాయి.

మందులు, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యమూ జరుగుతున్నా నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంలో కొనసాగుతున్న అశ్రద్ధ ప్రమాదాలకు దారితీస్తోంది. 2020 మేలో నగరంలోని గోపాలపట్నం వద్ద ఎల్‌జి పాలిమర్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 12 మంది మృతిచెందినప్పుడు... ప్రభుత్వం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అన్ని రకాల ప్రమాదకర పరిశ్రమలను తనిఖీచేసి లోపాల్ని గుర్తించాలని ఆదేశించింది. అత్యంత ప్రమాదకర కంపెనీలు 19, ప్రమాదకర పరిశ్రమలు 191, రెడ్ కేటగిరీ పరిశ్రమలు 56 వరకు ఉన్నట్లు అప్పట్లో గుర్తించారు. ఈ పరిశ్రమలను అధికారులు బృందాలుగా వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 121 పరిశ్రమల్లో లోపాలున్నట్లు గుర్తించి, భద్రతా ప్రమాణాలు అమలుచేయని యాజమాన్యానికి నోటీసులు జారీచేశారు. దాదాపు 30 పరిశ్రమలపై కేసు కూడా నమోదుచేశారు. అయినా ఎటువంటి మార్పూ లేదు. పరిశ్రమల లోపాలపై కఠినంగా ప్రభుత్వం వ్యవహరించకపోవడంతో ప్రమాదాలు ఆగడంలేదు.

నిర్వహణ లోపాల కారణంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రసాయన చర్యలు వల్ల నిర్ణీత స్థాయికి మించి ఉష్ణోగ్రతలు, ఒత్తిడికి రియాక్టర్లు పేలకుండా సేఫ్టీ వాల్వ్, రప్చర్ వాల్వ్‌లు తెరుచుకొనే వ్యవస్థ ఏర్పాటుచేస్తే, దీనిద్వారా రియాక్టర్లోని రసాయన మిశ్రమం డంప్ ట్యాంకులోకి వెళ్లడం ద్వారా ప్రమాద తీవ్రత తగ్గడానికి అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఆ వాల్వ్‌లు సరిగా పనిచేస్తున్నాయా? లేదా? అని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు నిర్వహణకు సంబంధించిన రికార్డు నిర్వహించాలి. చట్ట ప్రకారం ఆర్నెళ్లకు ఒకసారి గుర్తింపు పొందిన సంస్థతో భద్రతపై తనిఖీ చేయించి ధ్రువీకరణపత్రాలు పొందాల్సివుంది. పరిశ్రమల శాఖాధికారులు పరిశ్రమల నిర్వహణపై తనిఖీచేసి, లోపాలను గుర్తించి సరిచేసేలా ఆదేశించాల్సివుంది. ఈ తరహా జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు అవకాశాలు చాలా తక్కువని అంటున్నారు. ప్రమాదం జరిగినా కార్మికులకు రక్షణ పద్ధతులు సరిగా అమలుచేస్తే మరణాలు పెద్దగా చోటుచేసుకోవని చెబుతున్నారు. ఈ తరహా జాగ్రత్తలు పరిశ్రమల్లో తీసుకోకపోవడంతో భారీ ప్రమాదాలు చోటుచేసుకొని కార్మికులు మరణాలకు దారితీస్తోంది.

ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

పారిశ్రామిక ప్రగతి అంతా ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వనరులను వినియోగించుకోవాలన్నది ప్రభుత్వ విధానమని, సన్నాహక సమావేశానికి హాజరైన వారికి ముఖ్యమంత్రి తెలియజేశారని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చేందుకు పరిశ్రమల శాఖ ప్రయత్నిస్తోందని చెప్పారు.

దేశం మొత్తం మీద 11 ఇండస్ట్రియల్ కారిడార్లు ఉండగా, ఇందులో మూడు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం ఏపీకి కలిసి వచ్చే అంశమని చెప్పారు. ఇందులో 49 వేల ఎకరాల భూమి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం చేశామని, పరిశ్రమలు ఏర్పాటుకు ఎవరు ముందుకు వచ్చినా, మౌలిక సదుపాయాలతో పాటు, అనుమతుల మంజూరులో ప్రభుత్వం సరళంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 13 రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వివిధ దేశాల ప్రతినిధులకు వివరించామని, పిసిపిఐఆర్, ఫార్మా, టూరిజం రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి మంచి అవకాశం ఉన్నట్లు అంబాసిడర్లకు తెలియజేశామని చెప్పారు. 974 కిలోమీటర్ల పరిధిలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి తీసుకుంటున్న చర్యల గురించి పారిశ్రామికవేత్తలకు తెలియజేశామన్నారు. రెన్యువబుల్ ఎనర్జీలో భారీ పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. మార్చి మూడు, నాలుగు తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్, 28, 29 తేదీల్లో జరిగే జి-20 సదస్సులు విశాఖ, రాష్ట్ర భవిష్యత్తును మార్చే వేదికలు కాబోతున్నాయని ఆయన చెప్పారు.

జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా తులసీరాం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం న్యాయవాదిగా మళ్ళ తులసీరాం నియమితులయ్యారు. దీనిపై బుధవారం నిర్వహించిన జివిఎంసి కౌన్సిల్‌లో వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ప్రతిపాదించగా (టేబుల్ ఎజెండాలో భాగంగా) మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సహా పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. జివిఎంసి ఆస్తుల పరిరక్షణలో భాగంగా 8జోన్ల పరిధిలో 8మంది న్యాయ సలహాదారులను ఎంపిక చేసేందుకు స్టాండింగ్ కౌన్సిల్ ప్రతిపాదించింది. జివిఎంసి ఆస్తులకు సంబంధించి న్యాయ పోరాటం చేయడం, కేసుల్లో విజయం సాధించేలా వాదించడం వీరి పని అని కౌన్సిల్‌లో తేల్చారు. వీరంతా ఏడాది పాటు సేవలందిస్తారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో రూ.20లక్షలతో సామాజిక భవన నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ పైడిశెట్టి ఉష్శ్రీ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ గడపగడపకూ కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు వార్డు పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అందులో భాగంగానే సామాజిక భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జక్కంపూడి సత్యనారాయణ, తిరుపతి రావు, నరసయ్య, అప్పన్న, రవి, వల్లి, గోపి, వీరబాబు, రాణి, రామ, రాగూర్, శ్రీను, లక్ష్మణ్, శ్యాం, కన్నా, డిఇఇ, ఎఇలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విశాఖ రాజధాని ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి -మధురవాడ: విశాఖ రాజధానిగా పునరుద్ఘాటిస్తూ ముఖ్యమంత్రి జగన్ చేసిన ప్రకటనపై ఏడోవార్డు వాంబే కాలనీలో వార్డు వైసిపి అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జగన్ చిత్రపటానికి మహిళలు హారతులిచ్చి, క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం కమిటీ సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, చంద్రంపాలెం పాఠశాల కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, బంగారు ప్రకాష్, పసుపులేటి గోపినాథ్, ఎల్లాజీ, రామిరెడ్డి, వెంకటేష్, వాసు, మహిళలు చేకూరి రజిని, తమ్మినేని వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రంథాలయంలో అదనపు గది ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌వివిఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతమున్న గ్రంథాలయ భవనానికి అదనంగా నిర్మించిన గదిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ విభాగాధిపతి జి.అనురమ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తునికి సాయం



వెంకటరమణకు సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి

ప్రజాశక్తి -విశాఖపట్నం : కేన్సర్ రోగికి రూ.6వేల ఆర్థిక సాయన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అందజేసింది. శ్రీకాకుళం నగరం గుడి వీధికి చెందిన తోట వెంకటరావు కేన్సర్‌తో బాధపడు తున్నారు. విశాఖలోని ఒమేగా హాస్పిటల్‌లో చికిత్స పొందు తున్నారు. మందుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిసిన వెంటనే హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ప్రతినిధులు రూ.6,000ను వెంకటరావు కుటుంబానికి అందజేశారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

మండల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మండల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-పద్మనాభం : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కె.రాంబాబు అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో పెండింగ్‌లో ఉన్న పనులు, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలుకావాలంటే ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయం, సహకారం ఎంతో అవసరమన్నారు. మండలానికి 396 ఇళ్లు మంజూరైనా, నేటికీ వాటిలో అనేక ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంపై ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే రద్దయ్యే అవకాశం ఉన్నందున లబ్ధిదారుల వద్దకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి వెంటనే పనులుప్రారంభించి, పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులను ప్రశ్నించి, త్వరితగతిన వాటిని చేపట్టడం ద్వారా మార్చి ఒకటో తేదీనాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు చేపట్టలేని స్థితి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంకటాపురంలోని యాతవాని చెరువు దురాక్రమణపై అధికారులు, నేతలు పరిశీలన చేయకపోవడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంకటాపురంలో గొర్రెలు, మేకలు మృత్యువాతతో పెంపకందారులు నష్టపోతున్నారని స్థానిక సర్పంచ్ కర్రిరమణ సమావేశం దృష్టికి తేగా, దీనిపై పశు వైద్యాధికారి మహేష్ వివరణను ఎమ్మెల్యే ముత్తంశెట్టి కోరారు. ఆ గ్రామంలోని జీవాలకు గతంలో చేసిన బీమా గడువు ముగిసిపోయిందని, కొత్తగా ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయాల్సి ఉందని డాక్టర్ మహేష్ వివరించారు. ఉదయం పదిన్నర గంటలకు సమావేశం నిర్వహిస్తామని ప్రకటించి, మధ్యాహ్నం రెండుగంటలకు ప్రారంభించడంతో పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సారధులు పారాలీగల్ వాలంటీర్లు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి



జ్యోతిప్రజ్వలనతో శిక్షణను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అవసరమైన వారికి ఉచిత న్యాయాన్ని అందించే సారధులే పారా లీగల్ వాలంటీర్లని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి అన్నారు. బుధవారం జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థలోని న్యాయ సేవా సదన్‌లో పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో రాజ్యాంగం, మౌలిక స్వరూప విధివిధానాలపై సీనియర్ న్యాయవాది కుప్పిలి మురళీధర్ అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన నల్సా పథకాలపై మరో న్యాయవాది ఆర్ శ్రీనివాసరావు వివరించారు.. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విధివిధానాలు, అందిస్తున్న సేవలపై సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులికృష్ణ వివరించారు.

పోలీసుల చొరవతో బిచ్చగాడికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక వద్ద గల బ్రాందీ షాపు వద్ద అనారోగ్యంతో మృతి చెందిన బిచ్చగాడికి పోలీసులు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బిచ్చగాడికి స్థానికులు సపర్యలు చేసినప్పటికీ, ఆరోగ్యం కుదుటపడక బుధవారం మధ్యాహ్నం మృత్యువాత పడ్డాడు. అందిన సమాచారం మేరకు విఆర్ఒ, పోలీసులు వచ్చి స్థానికుల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ఎస్.రాయవరం, పద్మనాభంలో ఒక్కొక్కరు మృత్యువాత

ప్రజాశక్తి-యస్.రాయవరం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయని స్థానిక ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. రాంబిల్లి మండలం కాలిపల్లి గ్రామానికి చెందిన గుడిబన్ని దుర్గా ప్రసాద్ బుధవారం భార్యను చూడటానికి తన అత్త గ్రామమైన ఎస్.రాయవరం తన సోదరి భవానిని తీసుకుని ద్విచక్ర వాహనం పై వెళుతున్నాడు. సర్వసిద్ధి గ్రామం సమీపాన వినయ్ స్కూల్ మలుపు వద్దకు వచ్చేసరికి వాహనాన్ని అదుపు చేయలేక చెట్టును ఢీ కొట్టాడు. దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందగా సోదరి భవానికి గాయాలవ్వగా స్థానికులు 108 లో యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత పడ్డాడు. సింహాచలం నుంచి విజయనగరం పోవు రోడ్డులో మద్ది జంక్షన్ సమీపంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో, బైకిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం పరారైంది.

380 మత్తు ఇంజక్షన్లు స్వాధీనం

- ఒకరి అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు విశాఖపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యాన విశాఖ నగరంలో అక్రమ మత్తు ఇంజక్షన్ల విక్రయాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మహారాణిపేట సెబ్ స్టేషన్ పరిధిలో మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న అల్లిపురంకు చెందిన బోద శ్రీను నుంచి అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన పెంటాజోసిన్ లైసిన్ లాక్టట్ ఇంజక్షన్ 380 ఆంపిల్స్‌ను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి మత్తు ఇంజక్షన్లను ఖరగపూర్‌కు చెందిన దుర్గా ప్రసాద్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. మత్తు ఇంజక్షన్ ఒక్కొకటి రూ.70కి కొనుగోలు చేసిన శ్రీను రూ.200కు యువతకు విక్రయిస్తున్నారని సెబ్ అధికారులు తమ విచారణలో గుర్తించారు. బోద శ్రీను (38)ను అరెస్ట్ చేసి, నాలుగు సెల్ ఫోన్లు, 380 ఇంజక్షన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాల అక్రమ విక్రేతల విషయంలో సెబి అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని విశాఖపట్నం సెబి జెడి బమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు, జెవి అగ్రహారం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జనవరి 31న అదృశ్యమైంది. భీమిలి ఎస్ఐ జి హరీష్ కథనం ప్రకారం.. భీమిలిలో ఇంటర్ చదువుతున్న జెవి అగ్రహారం గ్రామానికి చెందిన 17ఏళ్ల విద్యార్థిని మంగళవారం ఉదయం ఇంట నుంచి కాలేజీకి వెళ్లిన ఆమె సాయంత్రం 6 గంటలు దాటినా ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు విద్యార్థిని కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తల్లి కృష్ణవేణి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మౌలిక వసతులు, వస్తు ఉత్పత్తి రంగానికి పెద్దపీట

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశ ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023-24 కేంద్ర బడ్జెట్ మౌలిక వసతుల కల్పన, వస్తూత్పత్తి రంగానికి పెద్ద పీట వేశారని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) పేర్కొంది. బడ్జెట్ సంతృప్తికరంగా ఉందని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ప్రశంసించింది. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బడ్జెట్‌పై సిఐఐ సెషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏపి సిఐఐ చైర్మన్ నీరజ్ శర్దా కీలకోపన్యాసం చేస్తూ..... ఎంఎస్ఎంఇలకు వడ్డీరేట్లు తగ్గడం ఈ బడ్జెట్‌లో ప్రధానమైన విషయమన్నారు. స్నేహపూర్వక పారిశ్రామిక వాతావరణం, సమగ్రమైన సుస్థిర ఆర్థిక లక్ష్యాల కోసం ఈ బడ్జెట్ దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో ఆర్థిక మాంద్య పరిస్థితుల దృష్ట్యా ఈ బడ్జెట్ మనదేశంలో ఆర్థిక పరిస్థితులు మెరుగుకు దోహదపడతాయన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సిఐఐ

సిఐఐ విశాఖపట్నం జోన్ మాజీ అధ్యక్షులు విజయనగర్ బయోటెక్ చైర్మన్ డి.తిరుపతిరాజు మాట్లాడుతూ, 2022 అమృత్ బడ్జెట్‌కు కొనసాగింపుగానే ఈ బడ్జెట్ ఉందని, 4 రకాల అభివృద్ధికి సప్తర్షి (సప్త రుషుల) మాదిరిగానే 7 అంశాలకు ప్రాధాన్యతలిచ్చారని పేర్కొన్నారు. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూడా బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పక తప్పదన్నారు. మౌలిక వసతుల కల్పనకు, వస్తూత్పత్తి రంగాన్ని బాగా గుర్తించారని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. పారిశ్రామిక పన్ను విధానంలో మార్పులు వస్తాయని ఆశించామని బడ్జెట్‌లో ఎక్కడా కానరాలేదని, ఇదిగనక వచ్చి ఉంటే విదేశీ పెట్టుబడులు వచ్చి ఉండేవన్నారు. బడ్జెట్‌లో డేటా ఎనాలసిస్ ఎంటర్ ప్రూనర్లకు ఊరట నిచ్చేలాగ స్టార్టప్‌లకు మేలు జరిగేలా నూతన పాలసీని తీసుకుందని సిఐఐ ప్రతినిధి ఫణీంద్ర తెలిపారు. ఐటాప్ ప్రతినిధి లక్ష్మీ ముక్కవల్లి మాట్లాడుతూ, యువతరంపై ఈ బడ్జెట్‌పై ఫోకస్ కనిపిస్తుందన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎలాంటి ప్రయోజనం కనిపించలేదన్నారు. సిఐఐ కౌన్సిల్ మెంబర్ వర్మ మాట్లాడుతూ, దీర్ఘకాలంలో దేశానికి ఈ బడ్జెట్ మేలు చేస్తుందన్నారు. సిఐఐ ప్రతినిధి ప్రదీప్ పాలడుగు మాట్లాడుతూ, మౌలిక వసతులకు రూ.లక్షల కోట్లు కేటాయింపు మంచి పరిణామమన్నారు. సిఐఐ విశాఖపట్నం మాజీ చైర్మన్ డాక్టర్ వర్మ వాగేశ్వ మాట్లాడుతూ, సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని పెంచే దిశగా బడ్జెట్ ఫోకస్ ఉందన్నారు. సిఐఐ ఉమెన్ ప్రతినిధి లలితా సుందరి మాట్లాడుతూ 'బడ్జెట్ తాలూకా తుది ప్రతి చేతికి వస్తేగానీ ఏ రంగానికి మేలు, నష్టం అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు.

విద్యుత్ ఎఇగా అప్పలనాయుడు



ఎఇ అప్పలనాయుడు

ప్రజాశక్తి -పిఎం పాలెం : మూడో జోన్ పరిధిలోని పిఎంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇగా మండల అప్పలనాయుడు బుధవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సహాయ సహకారాలతో సబ్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరం విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానన్నారు. సిబ్బంది భద్రత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానన్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, టెక్కలి డివిజన్ పరిధిలోని మెళియాపుట్టి మండలం నుంచి బదిలీపై వచ్చారు ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి
పంచాయతీ కార్మికుల ధర్నా



సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించిన పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి- ఆనందపురం: సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీల పారిశుధ్యం, వీధిదీపాలు, ప్లంబర్ కార్మికులు ఆనందపురం కూడలి నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, డివిజన్ సెక్రటరీ రవ్వ నర్సింగరావు, ఐద్వా జిల్లా నాయకురాలు నాగరాణి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులిచ్చి, పిఎఫ్, ఇఎస్ఐ ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. విధినిర్వహణలోఉన్న వారికి అవసరమైన ఉపకరణాలతోపాటు రెండు జతలు యూనిఫామ్, చెప్పులు ,సబ్బులు, నూనె ఇవ్వాలన్నారు .ప్రమాద బీమా సౌకర్యం కల్పించి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పైల శంకర్, డి. శంకర్, సత్యనారాయణ అప్పలరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


పుస్తకాలను అందజేస్తున్న నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి పిఎస్ఎమ్ హైస్కూల్ గ్రంథాలయానికి స్థానిక ప్రముఖులు మొకర నారాయణ రావు సతీమణి మహలక్ష్మి జ్ఞాపకార్థం ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణా రావు సొంత నిధులు రూ.ఐదు వేలతో సమకూర్చిన పుస్తకాలను బుధవారం 3 వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ అందజేశారు.వీటిల్లో శంకర నారాయణ, సిపి బ్రౌన్ నిఘంటువులు, పెద్ద బాలశిక్ష మూడు భాగాల పుస్తకాలు, పలు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. పాఠశాల హెచ్ ఎం తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో అశోక్‌గజపతి


అశోక్ గజపతిని స్వాగతిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న బుధవారం సింహాచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా అధికారుల స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జ్ హరినాథ్ దంపతులు కూడా సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు.

రేషన్ కార్డుదారులకు గోధుమ పిండి

కిలోరూ.16 చొప్పున నెలకు రెండు ప్యాకెట్లు
విశాఖలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన మంత్రి కారుమూరి


గోధుమపిండి ప్యాకెట్ల పంపిణీ ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ప్రజాశక్తి- సీతమ్మధార : రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు ఇకపై కిలో రూ16 చొప్పున నెలకు రెండు కిలోల గోధుమపిండి సరఫరా చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సీతమ్మధార, నక్కవానిపాలెంలోని రేషన్‌డిపోల్లోని కార్డుదారులకు ఎండియు వాహనం వద్ద గోధుమపిండి ప్యాకెట్లపంపిణీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలోని ఐదు జిల్లాలలో రేషన్ కార్డుదారులకు ప్రయోగాత్మకంగా గోధుమ పిండి ప్యాకెట్లను రాయితీ ధరకు అందించనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే అన్ని జిల్లాలకు విస్తరిస్తామని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్. విశ్వనాథన్, వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఐ.రాజేశ్వరి,రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు చిట్టిరాజు పాల్గొన్నారు.

ఐదో వార్డు సమస్యలపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి సమకరించాలని ఆ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. బుధవారం జివిఎంసి కమిషనర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. ఐదోవార్డు, ముఖ్యంగా కొండవాలు ప్రాంతాలలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని కోరారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని వార్డు పరిధిలో మంచినీటి బోర్లు, కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. వీధిదీపాలు, డ్రైనేజీలు, శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని కోరారు. డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ, కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సాయిరాం కాలనీ, శారదనగర్ కాలనీలలో మంచినీటి ట్యాంకులు, జెఎన్‌ఎన్‌యుఆర్.ఎం, వైఎస్సార్ కాలనీ, సాయిరాం కాలనీ, స్వతంత్రనగర్, ఎన్టీఆర్ హుదూద్ కాలనీలలో తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు దీనిపై కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి, తర్వాత కమిషనర్‌కు ప్రత్యేకంగా వినతిపత్రం ఇచ్చి, అభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత మొల్లిలక్ష్మణరావు ఉన్నారు.

24న విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు



ఎన్నికల అధికారికి నియామక పత్రం ఇస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నం జిల్లా న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు ఈనెల 24న జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది, న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు జి మహేశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్యులు రవీంద్రబాబు వేణుగోపాలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వెంటనే ఎన్నికల అధికారిగా షెడ్యూల్‌ను ప్రకటించారు.

ఈ నెల పదో తేదీలోపు సభ్యులందరూ సభ్యత్వాలను చెల్లించాలని, వెంటనే ఓటర్ల జాబితాను వెల్లడిస్తామన్నారు. తర్వాత ఈనెల 10 నుండి 16 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, 22న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీ అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు. ఈనెల 24న ఉదయం 10 గంటల నుండి సాయంకాలం నాలుగున్నర గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎన్నికల్లో విశాఖ న్యాయవాదుల సంఘానికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షుడు, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ, సాంస్కృతిక సెక్రటరీ పదవులను అభ్యర్థులను ఎన్నుకోనున్నారు.

అనాథలకు ఆహార ప్యాకెట్లు అందజేత


ఆహార పొట్లాలను ఇస్తున్న కీర్తి పట్నాయక్

ప్రజాశక్తి- మాధవధార : శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న అనాథలకు ఆహార పొట్లాలు, పండ్లను ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కుప్పిలి కీర్తి పట్నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రస్ట్ మాజీ వ్యవస్థాపక అధ్యక్షులు కే త్రినాధరావు పేరు మీద ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రైల్వే కానిస్టేబుల్ బి బంగారప్పుడు, ఎన్ఎస్‌టిఎల్ విశ్రాంత ఉద్యోగి టివి.చారి, ఆటో యూనియన్ సభ్యులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ సదస్సుకు
అపోలో వైద్యుని కథనాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : వియన్నా, ఆస్ట్రియాలో జరగనున్న ప్రతిష్టాత్మక యూరోపియన్ ఫెడరేషన్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రామటాలజీ (ఇఎఫ్ఒఆర్‌టి) వార్షిక సదస్సుకు అపోలో ఆసుపత్రి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ విజయవంతంగా నిర్వహించిన రెండు అరుదైన శస్త్రచికిత్స కథనాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు ఇఎఫ్ఒఆర్‌టి సైంటిఫిక్ కమిటీ ఒక లేఖను పంపించింది. డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ తాలస్ ఆంధ్ర రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆస్టియోకాండ్రల్ గాయం కోసం చీలమండ ఆర్థ్రోస్కోపి, ఎటిఎఫ్ఎల్ పునర్నిర్మాణం ఆర్థ్రోస్కోపి చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ రెండు చికిత్సలకు సంబంధించిన శాస్త్రీయ కథనాలు ఎఫోర్ట్‌కు ఎంపిక కావడంపై అపోలో ఆసుపత్రికి దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎసిపి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - సీతమ్మధార : ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల కలిగే ఇబ్బందులపై మూడో జోన్ ఎసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యం పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో వ్యాపారులు, ప్రజల్లో అవగాహనకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి సిరిపురం జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎసిపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఫుట్‌పాత్‌లను ఎవరూ ఆక్రమించరాదని, దీని వల్ల వాహనాలతోపాటు పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తొలగించిన వాటి స్థానే మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో టిపిఎస్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఉపాలయాల్లో కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానానికి అనుబంధ దేవాలయాలైన కొండపైన త్రిపురాంతక స్వామి ఆలయంలో ఉదయం, కొండదిగువన వెంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం ఐదు గంటలకు, తిరిగి దోషం అనంతరం ఏడున్నర గంటలకు స్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని అర్చక స్వాములు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు కల్యాణ మండపాన్నిప్రత్యేక పుష్పాలతోపాటు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. కల్యాణాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షణ


సిబ్బందికి సూచనలు చేస్తున్న జెడ్‌సి

ప్రజాశక్తి -పిఎం పాలెం: జివిఎంసి రెండోజోన్ పరిధిలోని ఐదో వార్డులో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి బుధవారం విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల నమోదును పరిశీలించారు. వార్డు పరిధిలోని ప్రజలు, మహిళలతో మమేకమై తడిపొడి చెత్తసేకరణ, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను సరిచేయాలి

డిఆర్‌ఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితాలో లోపాలను సరిదిద్దాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణకు సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ బుధవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని నిరక్షరాస్యులకు, ఐదవ తరగతి, పదో తరగతి, ఇంటర్, డిప్లమో, జిఎన్ఎంలను కూడా ఓటర్ల జాబితాలో చేర్చారని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను పొందుపరచడం జరిగిందని, విచారణ చేపట్టి అవకతవకలను సరి చేయాలని కోరారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఎక్కడ వారికి అక్కడే ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, వివి శ్రీనివాసరావు, అల్లు రాజు. ఆళ్ల మహేశ్వరరావు పాల్గొన్నారు.

అవకతవకలను సరిచేయాలని వినతి

మునగపాక రూరల్ : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఓటర్ల జాబితాలో అనేక అవకతకులు చోటుచేసుకున్నాయని, వాటిని సరి చేయాలని కోరుతూ మండల తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు బుధవారం సిపిఎం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మునగపాక మండలంలో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ఇచ్చినప్పుడే డిగ్రీ లేని 43 మందిని గుర్తించి వారి సీరియల్ నెంబర్లతో సహా మండల తహసీల్దార్‌కు ఇచ్చామని, అయినా తుది ఓటర్ల జాబితాలో పదో తరగతి, డిప్లమో అర్హతతో కూడిన వారు, అసలు చదువు రాని వారి పేర్లు ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ నెంబర్ 196లో పదవ తరగతి, డిప్లమో, అసలు చదువు లేని వారు 20 మంది వరకు ఉన్నారన్నారు. ఇదే పోలింగ్ బూత్‌లో విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం, గాజువాక, కంచరపాలెం, మద్దిలపాలెం మధురవాడ, మల్కాపురం, పెదగంట్యాడ, అల్లూరి సీతారామరాజు జిల్లా మజ్జిపుట్టు, అనకాపల్లి జిల్లాలోని పరవాడ, పాయకరావుపేట వంటి మండలాల ఓట్లు వందకు పైగా మునగపాక మండల ఓటర్ల జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర మండలాల ఓటర్ల పేర్లు ఈ మండలంలో ఉంటే ఆయా మండలాల్లో వారు ఓట్లు లేకపోవడంతో అర్హులైన వారు తమ విలువైన ఓటు హక్కు వినియోగించుకునే అవకావం కోల్పోతారని, దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు లోకనాథం తదితరులు

మండల తహశీల్దారు సస్పెన్షన్



తహశీల్దారు సుధాకర్

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండల తహశీల్దారు సుధాకర్‌ను విధులు నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కశింకోట మండలంలో పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్ చేయడం విషయంలో ఆర్ఓఆర్ చట్ట నిబంధనల పాటించకుండా ఉండడం వల్ల అర్హులైన రైతులు నష్టపోవడం, భూముల రీ సర్వే సక్రమంగా నిర్వహించికపోవడం వంటి విషయాలు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి విచారణ వెల్లడించారు. ఈ అంశంపై సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన మండలాల తహశీల్దార్లు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ప్రజలను మభ్య పెట్టేందుకే విశాఖ రాజధాని ప్రకటన

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలను మభ్య పెట్టేందుకే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విశాఖ రాజధాని ప్రకటన చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో రాష్ట్ర రాజధాని కానున్న విశాఖపట్నానికి మిమ్ములను ఆహ్వానిస్తున్నామని చెప్పడం వెనుక అనేక కారణాలున్నాయని పేర్కొన్నారు. జగన్ రెడ్డికి ప్రజాదరణ తగ్గుతుందని ఇండియా టుడే సి ఓటర్ల సర్వేలో తేలడం, వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు మూలాలు బయటకు రావడంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజధాని ప్రకటన చేశారని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ఎంఓయులు కుదుర్చుకున్న కంపెనీలను తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలకు తరిమేశారని తెలిపారు. ఉన్న పరిశ్రమలను తరిమివేయడం, రాని పరిశ్రమల కోసం ఎదురుచూడడం వైసీపీకి అలవాటుగా మారందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ ప్రకటనలే తప్ప జిల్లాకు ఒక్క పరిశ్రమ తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేటీకరణకు పూనుకుంటే 22 మంది ఎంపీలు ఉన్న వైసిపి ఎందుకు ఆపే ప్రయత్నం చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు వేగి వెంకటరావు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డుకు తూట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఏఐటియుసి జిల్లా నాయకులు కోన లక్ష్మణ విమర్శించారు. మండలంలోని మామిడిపాలెం, మూలపేట గ్రామాల్లో బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీతో ఇసుక కొరత సృష్టించి కార్మికులకు పని లేకుండా చేసిందని తెలిపారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. చిన్ని, భూపాలం మహాలక్ష్మి నాయుడు, ఉప్పులి సత్తిబాబు, శ్రీను, ఆళ్ల అప్పారావు, నరసింహారావు పాల్గొన్నారు.

94వ రోజుకు నేవీ నిర్వాసితుల దీక్షలు

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎబి గేట్ ఎదుట ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 94వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి పెద్దలు మాట్లాడుతూ 94 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే అనేక సార్లు అనకాపల్లి కలెక్టరేట్‌కు చర్చలకు వెళ్లామని, అయినా సమస్యలను పరిష్కరించలేదని పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

సర్పంచుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా బాబూరావు



ప్రజాశక్తి-దేవరాపల్లి : సర్పంచుల సంఘం మాడుగుల నియోజకవర్గం అధ్యక్షులుగా వైసిపి మండల అధ్యక్షులు, బి.కింతాడ సర్పంచ్ బూరె బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాబూరావును నాలుగు మండలాల వైసిపి ఎంపిపిలు, జెడ్పిటిసిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షులు నారాయణరావు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల మండల సంఘం సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం మండల అధ్యక్షునిగా కెవిఎస్.నారాయణరావు (చోడవరం), ఉపాధ్యక్షులుగా కె.యశ్వంత్, ప్రధాన కార్యదర్శిగా పి.విజయ, కోశాధికారిగా టిఎఇఎన్ఎస్.సూర్యనారాయణ, అధికారి ప్రతినిధిగా డి.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి-1గా జెఎవి.గంగాధర్, సంయుక్త కార్యదర్శి-2గా కె.వైకుంఠరావు, సభ్యులుగా జి.విష్ణు, బి.గాయత్రి, టి.భాగ్య, పి.గెన్ను ప్రకాష్ ఎన్నికయ్యారు.

ఆయుర్వేదంపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆయుర్వేద వైద్యంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు కె.లావణ్య అన్నారు. స్థానిక భీముని గుమ్మం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుర్వేద ఆహార విధానాలు, జీవన సరళి, విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని ఏ విధంగా జయించాలి, దైనందిన కార్యక్రమాల్లో ఆయుర్వేద పనితీరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న సచివాలయం-3 వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి ఆ గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కొయ్య జగదలక్ష్మి భాస్కర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపాకలో కలెక్టర్ పర్యటన



భూ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి బుధవారం మండలంలోని చింతపాక గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులు, బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. అనంతరం స్థానిక నమ్మి వారి చెరువు వద్ద జరుగుచున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలందరికీ పని కల్పించడంలో అశ్రద్ధ వద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలను సందర్శించారు. గ్రామ సచివాలయం వెల్నెస్ సెంటర్ నిర్మాణాలను పరిశీలించారు. జగనన్న రీ సర్వేపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రికార్డుల తయారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సర్వేయర్ వినోద్ కుమార్, వీఆర్వో రమణపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. భూ సర్వే లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా రికార్డులు తయారు చేయాలని ఆదేశించారు.

వీధి దీపాలకు వినతి

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ గోలజన శ్రీను కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చింతపాక జంక్షన్ నుండి గ్రామం సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందని, చీకటి పడిన తరువాత వస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ 2 కిలోమీటర్ల దూరానికి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అంబేద్కర్, మండల సర్వేయర్ సింహాచలం, హౌసింగ్ ఏఈ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలి



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం ఆశా కార్యకర్తల జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆశాలపై విపరీతమైన పని భారం పెంచిందని, సంబంధం లేని పనులు కూడా అప్పగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉండాల్సిన ఆశా కార్యకర్తలకు సచివాలయాలు, సబ్ సెంటర్లు వద్ద డ్యూటీలు వేయడం, జాబు చార్టులో లేని ఆన్లైన్ పనులను అప్పగించడం సరికాదని పేర్కొన్నారు. గతంలో పల్స్ పోలియో, టిబి సేవలు అందించినందుకు పారితోషికాలు ఇచ్చే వారని, నేడు ఇవ్వడం లేదన్నారు. సంక్షేమ పథకాలలో కోత పెడుతున్నారని, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటిన నేపథ్యంలో ఇస్తున్న జీతాలు ఛార్జీలకే సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలను తనిఖీల నిమిత్తం ఆసుపత్రికి సొంత డబ్బులతో తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సరిగా పనిచేయలేదని, సొంత డబ్బులతో మంచి ఫోన్లు కొనుక్కోమని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జాబ్ చార్టు నిర్ణయించాలని, అదనపు పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ పార్వతి, కార్యదర్శి వరలక్ష్మి, నాగమణి, కే లక్ష్మి, కోశాధికారి సూర్య కుమారి, ఆశా యూనియన్ 24 మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమరయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాల జెఎసి చేపట్టిన సమరయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను బుధవారం స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో జెఎసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 25 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ఈ సమర యాత్ర సాగుతోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, గిరిజన, పెట్రో యూనివర్సిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని, విశాఖ రైల్వే జోన్ ఇవ్వాలని, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని తదితర డిమాండ్లతో ఈ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ రమణ, డివిజన్ కార్యదర్శి గొర్లి తరుణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్, పిడిఎస్‌ఓ నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలం సింగన్న దొరపాలెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన రొంగలి అక్కు నాయుడు కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. జనవరి 27న రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో అక్కునాయుడుకు చెందిన పాడి పశువు మృత్యువాత పడగా, రెండు మూగజీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. గడ్డిలో నిల్వ ఉంచిన ధాన్యం నిల్వలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పైలా ప్రసాదరావు బుధవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబంతో మాట్లాడారు. వారికి ప్రసాదరావు రూ.5 వేలు, ఆ గ్రామ సర్పంచ్ వెలగల పైడంనాయుడు రూ.5 వేలు మొత్తం రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పిల్లల రమణ, నాయకులు గొర్లె దేముడు, పైలా పైడం నాయుడు, ముత్యాల నాయుడు, జాగారపు అప్పలనాయుడు, రొంగలి రమణేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పని

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి
వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంలో ఆశా, అంగన్వాడీ, ఏఎన్ఎంలు పని చేసినప్పుడు స్త్రీ శిశు సంక్షేమ సాధికార అవుతుందని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. అనకాపల్లి గుండాల వీధి సచివాలయ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిడిపిఓలు సమన్వయంతో తల్లి పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్యం, కాన్పులు, రక్తహీనత గుర్తించడం, పౌష్టికాహారం అందించడంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కేజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ కె శ్యామలతో మాట్లాడి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హేమంత్ కుమార్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, పిహెచ్‌సి వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ గేమ్‌లో కృష్ణ శ్రీకర్ ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి
జనవరి 27 నుంచి 29 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ గేమ్స్ అండర్-14లో సాబర్‌లో దేవరాపల్లి మండలం, చిన నందిపల్లి గ్రామానికి చెందిన గేదెల కృష్ణ శ్రీకర్ అద్భుత ప్రతిభ చాటాడు. వ్యక్తిగత ఈవెంట్‌లో కర్నూల్‌పై ఆడి బంగారం, గ్రూపులో కాంస్య పతకాలు గెల్చుకున్నాడు. జిల్లా నుంచి 31 మంది క్రీడాకారులు వెళ్లగా జట్టుకు కోచ్‌గా గోవింద్, మేనేజర్‌గా దేవి వ్యవహరించారు. కృష్ణ శ్రీకర్ సంగివలస శశి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా శ్రీకర్‌ను స్కూల్ యాజమాన్యం, ఫెన్సింగ్ సంఘం నాయకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆనంద్...

దేవరాపల్లి : ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి సేనాపతి ఆనంద్ మంచి ప్రతిభ కనబర్చారు. కడప జిల్లాతో విశాఖపట్నం జట్టు జలపడగా ఆనంద్ అద్భుత ప్రతిభ కనబర్చడంతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆనంద్‌ను, ఆయనకు శిక్షణ ఇచ్చిన పిడి డి.నరసింగరావును పాఠశాల హెచ్ఎం వి.ఉమాశంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయిలో త్రో బాల్ పోటీల్లో దుర్గాప్రసాద్‌కు కాంస్యం

అచ్యుతాపురం : జనవరి 28, 29, 30 తేదీల్లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -14 త్రో బాల్ పోటీలో మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.దుర్గా కుమార్ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించాడు. దుర్గాప్రసాద్‌ను, ఆయనకు తర్ఫీదు నిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ధర్మిరెడ్డి రాజును బుధవారం పాఠశాల హెచ్ఎం వై.జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు కెఆర్ ఓమార్, గాంధీ, ఎస్‌కె బాషా, శంకరరావు, హైమావతి, అమ్మాజీ తదితరులు అభినందించారు.


పాఠశాల హెచ్ఎంతో దుర్గాప్రసాద్

ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి - కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ స్వామి నాయుడు అన్నారు. మండలంలోని జి.భీమవరంలో పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభదాయకంగా ఉన్న సేంద్రియ పంటలు పండించాలని, 30 రకాలు విత్తనాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి త్రినాథ్ వర్మ, తాళ్లపాలెం యూనిట్ ఇన్‌ఛార్జి ద్వారపురెడ్డి రమణ, కాయల దేవి, ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కోరుకొండకు సన్మానం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమించబడిన తురకలపూడి పిఎసిఎస్ అధ్యక్షులు కోరుకొండ అప్పలనాయుడును పలువురు బుధవారం సన్మానించారు. సన్మానం చేసిన వారిలో ఎంపిపి దాకరపు నాగేశ్వరిదేవి, వైసిపి మండల అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ, ఆకుల నాగేశ్వరరావు, పెదపూడి ఎంపిటిసి గోకివాడ రాము, చింతపాక సర్పంచ్ గొలజల శ్రీను, చిట్టియ్యపాలెం మాజీ సర్పంచ్ ఎస్.రాము తదితరులున్నారు.

చౌక డిపోల ద్వారా గోధుమ పిండి సరఫరా

ప్రజాశక్తి-అనకాపల్లి : చౌక డిపోల ద్వారా గోధుమ పిండి సరఫరాను ప్రారంభించినట్టు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి తెలిపారు. స్థానిక గవరపాలెం డిపో నెంబర్ 35 పల్లపు వీధిలో బుధవారం గోధుమ పిండి ప్యాకెట్లను బుధవారం ఆమె పంపిణీ చేశారు. ప్రతి కార్డుకు రెండు కిలోల గోధుమపిండి ఎండియు ఆపరేటర్ వాహనం వద్ద పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కెవిఎస్ఎన్ ప్రసాద్, ఎంఎస్ఓ చుక్కా కళ్యాణి కుమారి, సిఎస్‌డిటి ఈశ్వరరావు, డీలర్ల యూనియన్ అధ్యక్షులు పెంటకోట నాయుడు పాల్గొన్నారు.

4న గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో ఈ నెల 4న శనివారం జరగనున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టుగా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ క్యాంప్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా ఉత్సవ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

జీవాలకు పారుడు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి -కశింకోట : జిల్లాలో గొర్రెలు, మేకలకు ఈనెల 1 నుండి 28 తేదీ వరకు పారుడు వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ బి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని జమ్మాదులపాలెంలో పిపిఆర్ టీకాలను బుధవారం సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మూడు నెలలు వయసు దాటిన గొర్రెలు, మేకలు అన్నిటికీ ఉచితంగా టీకాలు, చెవి పోగులు వేయించుకోవాలని పెంపకదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి సౌజన్య, డాక్టర్ పి భానుబాబు, డాక్టర్ అల్ఫోన్స జార్జ్, వైసిపి నాయకులు కరక శేషు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామంలో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు బుధవారం వేశారు. ఆరిపాక పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.స్వర్ణలత, సిబ్బంది కె.రమణారావు, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆలయ 98వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజారోహణ, బలిహరణం, కర్థం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలుపమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బోదువలసలో ఎలుపమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టను స్థానిక సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూత్ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఉగ్గిన లక్ష్మీ రాము, యడ్ల నాయుడు, దళిత నాయకులు యల్లపు రాంబాబు, గొల్లపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సిఐటియు పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : అచ్యుతాపురం ఎస్ఇజెడ్ జిఎంఎఫ్‌సి ఫార్మా కంపెనీలో మంగళవారం జరిగిన ప్రమాదంలో గాయపడి అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రభాకర్, జావి సుబ్బారావును బుధవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన చొంగల రామారావు కుటుంబానికి రూ.36 లక్షలు పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. క్షతగాత్రులకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని, నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎంఎస్ఎంఇసిసి జిల్లా కో-ఆర్డినేటర్‌గా సూర్య ప్రకాశరావు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని గొబ్బూరు గ్రామానికి చెందిన మళ్ళ సూర్య ప్రకాశరావు ఎంఎస్ఎంఇసిసి జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రం ఇటీవల విజయవాడలో అందుకున్నట్టు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యువతీ యువకులకు పారిశ్రామిక రంగంలో ఉత్పత్తులు తయారీ, కొనుగోలు, బ్యాంకు ద్వారా చిన్న పరిశ్రమలు ఏర్పాటు వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. తనను కో ఆర్డినేటర్‌గా నియమించిన ఆ శాఖ చైర్మన్ దేవరాజ్ దాసరికి ధన్యవాదాలు తెలిపారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కశింకోట : రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని కశింకోట మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. రోగులకు ఎప్పుడు కప్పుడు ఏయే మందులు పంపిణీ చెస్తున్నారు, ఏ మందులు కొరత ఉందో అని అడిగి తెలుసుకున్నారు. ఓపిని పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

నీలకంఠేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురంలో ఆ గ్రామానికి చెందిన గణపతిరాజు శ్రీనివాసరాజు రూ.50 లక్షలతో నిర్మించిన నీలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జెడ్పిటిసి సభ్యులు దొండా రాంబాబు, టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, మలిరెడ్డి బుజ్జి, ఏలంకాయల అప్పలనాయుడు, బోయిన నారాయణమూర్తి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. సమీప రాజాం, తైపురం, చిట్టి పాలెం, తురకలపూడి, అనకాపల్లి మండలం మెట్టపాలెం తదితర గ్రామాల నుండి వేలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని స్వామి వివేకానంద వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షులు మెరుగు నూకరాజు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపట్నం గ్రామానికి చెందిన వాసుపల్లి రాము అనే వికలాంగునికి సంకక్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధోని కాసుబాబు, రాజబాబు, సూరాడ ప్రభాకర్, కంబాల అప్పలరాజు, వాడమోదుల తాతారావు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

ప్రజాశక్తి అచ్యుతాపురం : మండలంలోని పెదపాడు గ్రామ శివాలయంలో బుధవారం టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులున్నారు.

వైభవంగా ఉమామహేశ్వరి దేవి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో ఉమామహేశ్వరి దేవి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఉమామహేశ్వరి దేవి ఆలయంలోనూ, వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం ఆలయం ముందు పెళ్లి రాట వేశారు. రాత్రి వేదమంత్రాల నడుమ కల్యాణం జరిగింది. ఈ ఉత్సవాల్లో భాగంగా దేవరాపల్లిలో ఐదు రోజులపాటు దేవి తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈనెల 5న చివరి రోజు దేవి విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు.



పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కొడవటిపూడిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-కోటవురట్ల: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం కొడవటిపూడిలో స్థానిక సర్పంచ్ కోసూరి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది, డాక్టర్ సుధీర్ దాదాపు 150 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవి, టిబి వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, వివిధ రకాలుగా సంక్రమించే ఈ వ్యాధులకు పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు.



సన్మానిస్తున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు

ఎంపిడిఒకు ఘన సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా పురస్కారం అందుకున్న ఎంపీడీవో డి సీతారామరాజును మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. ముందుగా గృహ నిర్మాణ శాఖ పిడి కూర్మినాయుడు జగనన్న లే అవుట్ల పై రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ప్రసాద్, ఏఈ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే బాబూరావు పరామర్శ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండల కేంద్రమైన రాయవరం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన వైసీపీ కార్యకర్త కర్రి రాజీవ్ గాంధీ కుటుంబాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరామర్శించారు. పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందని, కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని ఆయన భరోసాను ఇచ్చారు. ప్రభుత్వం తరపున వచ్చే సహాయాన్ని వెంటనే ఇప్పిస్తానని, గాంధీ భార్యకు ఉపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పింఛను మంజూరుపై విచారణ

ప్రజాశక్తి -మాకవరపాలెం:అర్హత లేకుండా పింఛన్ పొందుతున్నారంటూ స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎంపీడీవో ఆరుణశ్రీ విచారణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మాకవరపాలెం గ్రామానికి చెందిన కట్ట రామారావుకు అర్హత లేకుండా పింఛన్ మంజూరు చేశారని, ఆర్టీఐ కార్యకర్త ఫ్రాన్సిస్ జిల్లా కలెక్టర్కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే విచారణ చేపట్టినట్లు తెలిపారు. నివేదికను కలెక్టరుకి అందజేస్తామని తెలిపారు.

బడ్జెట్‌లో కార్మికులకు భరోసా ఏదీ? : సిఐటియు



ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: కేంద్రం ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్లో భవన నిర్మాణ, ఆటో, ముఠా కార్మికులకు, ప్రైవేటు విద్యా సంస్థలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్లో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి భరోసా లేదని ఏపి బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు తెలిపారు. కరోనా వంటి కష్టకాలంలో అనేక మంది ఆకలి చావులకు గురైతే కేంద్రం సానుభూతి తెలిపి సరిపెట్టిందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు తరహా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని అనేక ఏళ్ళుగా పోరాడుతున్నా ఆ ఊసే లేదన్నారు. మేడిన్ ఇండియా నినాదం తెచ్చిన బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి నిచ్చే పరిశ్రమల ఏర్పాటుకు ఎంతవరకు కేటాయింపు చేసారని తెలిపారు. పట్టణాల అబివృద్ధికి ఈ బడ్జెట్లో కేటాయింపు ఎక్కడా సరిపోవని తెలిపారు. విద్యా, వైద్యంకు సరిపడా కేటాయింపులు లేవన్నారు. కార్పోరేట్లను ప్రభుత్వం ఆదుకుంటుందని విమర్శించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట:సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశ్యమని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 98 శాతం హామీలు నెరవేర్చామని తెలిపారు. త రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. ఒకటో తేదీనే వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాస్, వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై ఎంపిడిఒ ఆరా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పింఛను పథకం పనితీరును స్థానిక ఎంపిడివో శ్రీరామచంద్రమూర్తి పరిశీలించారు. బుధవారం కొర్రుప్రోలు గ్రామంలో పెన్షన్లు పంపిణీ చేపట్టిన వాలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. పెన్షన్ సకాలంలో ఇస్తున్నారా, లేదా అనిలబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామం నుండి ఫిర్యాదు వచ్చినా సదరు వాలంటీరుపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుకు వాలంటీర్లే కీలక బాధ్యత వహించాలన్నారు. ఆయన వెంట వాలంటీరు రజని, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వాలీబాల్ కిట్లు పంపిణీ


ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో తూటి పాలలో యువ క్రీడాకారులకు గాయకులు ఆడిగడ్డ సతీష్ వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో ఉత్తేజాన్ని ఉత్సాహన్ని పెంపొందించేందుకు వివిధ గ్రామాలల్లో ఎంపిక చేసిన యువతకు వాలీబాల్ కిట్లు అందిస్తున్నామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సేవా భావంతో ముందుకెళుతూ చదువుతుతో పాటు క్రీడల్లో రాణిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొనాన్నరు.

ఘనంగా ఆంజనేయ స్వామి తీర్థం

ప్రజాశక్తి -నర్సీపట్నంరూరల్: మున్సిపాలిటీలోని బలిఘట్టం ఫైర్ స్టేషన్ వద్ద అభయాంజనేయ స్వామి 38వ వార్షికోత్సవ తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పాలాభిషేకం, తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బోళెం నరసింహమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి:తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల ఏర్పాటు అనుమతులను అడ్డుకోవాలని కోరుతూ జాతీయ మత్స్యకార సంఘ సెక్రెటరీ ఆఫ్ జనరల్ అనంత నగేష్ కు బుధవారం జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు ఆధ్వర్యంలో జాతీయ మత్స్యకార సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్, నాయకులు పిక్కి కోదండరావు, ఎరిపిల్లి అప్పలరాజు, శివ వినతిపత్రం అందజేశారు.విజయవాడలో జరిగిన మత్స్యకార సభలో మత్స్యకార సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నక్కపల్లి మండలంలోని రాజయ్యపేటలో హెటిరో డ్రగ్స్ కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచిపెట్టడానికి రెండవ పైప్ లైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు 426 రోజుల నుండి శాంతియుత మహాధర్నా చేపట్టినట్లు తెలిపారు. మత్స్యకారులు ధర్నా చేస్తున్నప్పటికీ పట్టించుకోకుండా రెండవ పైప్ లైన్‌కు అనుమతులు వచ్చాయని నగేష్ దృష్టికి తీసుకువెళ్లారు. రెండవ పైప్ లైన్ వేస్తే మండలంలో మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని పైప్ లైన్ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఇప్పటికే తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో సముద్ర జలాల కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయని, దీంతో మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకార సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని నగేష్ హామీ ఇచ్చినట్లు స్థానిక మత్స్యకార నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర నాయకులు గొల్ల ఏకాశ్వరి, ఘంటసాల వెంకట లక్ష్మిస్వామి,దోని గోపి, శంకర్, వేణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి

అపరాల్లో సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- నక్కపల్లి:అపరాల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని బుధవారం కాగిత, వేంపాడు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మినుము, పెసర పంటలను పరిశీలించారు. చిత్త పురుగు సోకడం గమనించి నివారణ చర్యల పై రైతులకు అవగాహన కల్పించారు. 2.5మిల్లీ క్లోరిపైరిఫోస్ లేక 1.6 మిల్లీ మోనో క్రోటోఫాస్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పసుపు ఆకు తెగులు నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా ఏసిఫేట్1.5 గ్రాము లీటర్ నీటికి లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఆర్‌బికే లకు ధాన్యం ఈనెల 15 లోపు రైతులు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజేష్, మోహన్,నాయుడు, రైతులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు ఇస్తున్న సిడిపిఒ

అంగన్వాడీలకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో సిడిపిఓ కార్యాలయ పరిధిలోని 12 మంది అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్, మినీ అంగన్వాడి కార్యకర్తలకు సిడిపిఓ సుజాత అర్హత పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్యాలయ పరిధిలో 14 పోస్టుల ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 12 సెంటర్లకు అభ్యర్థులను నియమించామని, రెండు సెంటర్లకు అభ్యర్థుల దరఖాస్తులు అసంపూర్తిగా ఉండడంతో నిలిపి వేసినట్లు తెలిపారు. కొత్తూరు, సుంకపూరు గ్రామాల అంగన్వాడి హెల్పర్లకు త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు పైల రమేష్, కొడవటిపూడి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కుమార్ రాజా పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్‌గా మంగ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో పిల్లవానిపాలెం అంగన్వాడి టీచర్‌గా దాసరి మంగ నియమితులయ్యారు. ఈ కేంద్రంలో పని చేస్తున్న టీచర్ గ్రైవాజ్రు కావడంతో 18 నెలల తర్వాత ఖాళీ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు దాసరి మంగను నియమిస్తూ ఉత్తర్వులను బుధవారం స్థానిక ఐసిడిఎస్ జూనియర్ అసిస్టెంట్ జె మాతయ్య అందజేశారు.



నియామక పత్రాలు ఇస్తున్న మాతయ్య



పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్

ఉత్తర వాహినిలో సౌకర్యాలు కల్పన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :18న మహాశివరాత్రి కారణంగా బలిఘట్టం ఉత్తర వాహినికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని స్థానిక మున్సిపల్ ఛైర్పర్సన్ ఆదిలక్ష్మి తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ సిబ్బందితో ఉత్తరవాహిని తీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, స్నాన ఘట్టాలను శుభ్రపరిచి మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తామని, పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులకు అనుకూలంగా షవర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ ఔదార్యం

కెజిహెచ్‌కు వెళ్లి పింఛను పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం:విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పింఛనుదారుడికి వాలంటీర్ పింఛను సొమ్మును అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. మండలంలో గర్నికం గ్రామానికి చెందిన కేశంశెట్టి గడ్డయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో, గ్రామానికి చెందిన వాలంటీర్ గట్రెడ్డి వంశీకృష్ణ కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న పింఛను దారుడికి వృద్ధాప్య పెన్షన్ అందజేశారు. వాలంటీర్‌ను గ్రామ సర్పంచ్ నూకరాజు, గ్రామ ప్రజల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



పింఛను ఇస్తున్న వాలంటీర్

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక గ్రామంలో భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెరక వీధి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో ఏకాహం (భజన) 24 గంటల పాటు నిర్వహించారు. భజన సమాజ సభ్యులు భక్తి గీతాలను ఆలపించారు.

ఎస్.రాయవరం:మండలంలోని తీరప్రాంత గ్రామమైన రేవుపోలవరం హిమగిరిపై లక్ష్మీ మాధవస్వామి వార్షిక కళ్యాణం కమణీయంగా జరిగింది. కళ్యాణంను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు నిత్యహోమాలు చేస్తామని పురోహితులు వాసు తెలిపారు.

కోటవురట్ల :మండల కేంద్రంలోని సాయి నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వార్షిక కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

పూర్ణామార్కెట్, ముడసర్లోవ భూములు ప్రైవేట్‌కు వద్దంటూ

సిపిఎం, సిపిఐ నిరసన



జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు



ధర్నా చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పూర్ణామార్కెట్, ముడసర్లోవ పార్కులను పిపిపి పేర ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు జివిఎంసి కౌన్సిల్ సమావేశం బుధవారం జరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ధర్నా, ర్యాలీలు చేపట్టొద్దని ఆంక్షలు విధించినప్పటికీ పోలీసు బందోబస్తు నడుమ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు మాట్లాడుతూ, పిపిపి పేరుతో పూర్ణామార్కెట్, ముడసర్లోవ భూములను వైసిపి అనుయాయులకు అప్పగించే ప్రతిపాదనలు తక్షణమే విరమించుకోకపోతే వైసిపి కార్పొరేటర్లను, ఎమ్మెల్యేలను, మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ధర్నాను విజయవంతం చేసిన ప్రజానీకానికి అభినందనలు తెలిపారు. విశాఖపట్నం ఏర్పడిన నుంచి పూర్ణామార్కెట్ పెద్ద హోల్‌సేల్ మార్కెట్‌గా ఉందని, దాని ద్వారా వందలాది మంది వాణిజ్య, వ్యాపారస్తులతో పాటు చిరువ్యాపారులు కూడా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ముడసర్లోవ పార్కు ఎంతోచరిత్ర కలిగినదన్నారు. ఈ పార్కు అభివృద్ధి పేరుతో జివిఎంసి నిధుల నుంచి ఇప్పటికే రూ. 50 కోట్లు ఖర్చుచేశారని తెలిపారు. ముడసర్లోవ రిజర్వాయర్‌ను మింగేయడంకోసం ఈ పార్కు అభివృద్ధి పేరుతో 283 ఎకరాల స్థలాన్ని, సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్) మార్కెట్‌ను వైసిపి నేత విజయసాయిరెడ్డి అనుయాయులకు కట్టబెట్టేందుకు పెద్దఎత్తున కుట్రపన్నారని విమర్శించారు. ఈ రెండూ ప్రైవేట్‌పరం అయితే ప్రజలపై మరింత భారాలు పడతాయని, రిజర్వాయర్ నుంచి తాగునీరు ప్రజలకు అందకుండా పోతుందని తెలిపారు. పూర్ణామార్కెట్, ముడసర్లోవ పార్కులను జివిఎంసియే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు ఆస్తులుగా మార్చడం సరైంది కాదన్నారు. విశాఖ రాజధాని అంటూ ప్రభుత్వ భూములను గెద్దల్లా వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు కొల్లగొడుతున్నారని విమర్శించారు. ఇటువంటి చర్యలు విశాఖ ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కౌన్సిల్ సమావేశంలో సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, ఎ.జె.స్టాలిన్‌లు ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా మేయర్ చాంబర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖకు వైసిపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న వైవి.సుబ్బారెడ్డి తక్షణమే వీటిని ప్రైవేట్ పరం కాకుండా ఆపాలని, లేదంటే ఆయనకు కూడా ఇందులో భాగం ఉన్నట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. వేమనమందిరం, జివిఎంసి మెయిన్ కార్యాలయాలను సైతం పిపిపి పద్దతిలో ప్రైవేట్‌వారికి కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారని, వైసిపి కబంధహస్తాల నుంచి ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుకునే విధంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జి 20 గ్లోబల్ సమ్మిట్ పేరుతో రూ.100 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేయడానికి సిద్ధపడుతున్నారని, జివిఎంసి నిధులు ఖర్చు చేసే ఆలోచన మానుకోవాలని కోరారు. జి 20 సమావేశాల పేరుతో తోపుడుబండ్లు, చిరువ్యాపారస్తులను అన్యాయంగా తొలగిస్తున్నారని, ఈ చర్యలు విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పి.చంద్రశేఖర్, బి.జగన్, సిఎన్.క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు, సిపిఎం, సిపిఐ నాయకులు పి.మణి, ఎమ్‌డి.బేగం, బి.వెంకటరావు, ఎన్.నాగభూషణం, ఎం.సుబ్బారావు, నరేంద్రకుమార్, వై.రాజు, కె.కుమారి, ఎంఎ.బేగం, ఎ.దేముడమ్మ, ఎస్.నాగభూషణం, ఎ.ఆదినారాయణ, ఎస్.మురళి, ఎం.శ్రీనివాసరావు, కుమారి, వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మిట్ల పేరుతో తోపుడుబండ్లు తొలగింపు ఆపాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జి 20, గ్లోబల్ సమ్మిట్ ల పేరుతో నగర పరిధిలోని తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులను తొలగించే చర్యలను విరమించాలని విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం డిమాండ్‌చేశారు. ఈ మేరకు జివిఎంసి మేయర్ హరి వెంకటకుమారికి బుధవారం వినతి పత్రం అందించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పొట్ట చేత పట్టుకొని విశాఖ నగరానికి వలస వచ్చిన అత్యధికమంది, స్వయం ఉపాధితో బతుకుతున్నారని వివరించారు. తోపుడు బళ్ళను వీధుల్లోనూ, సంతల్లోనూ, చిన్న బడ్డీ దుకాణాలు పెట్టుకొని కుటుంబాలను పోషించుకుంటున్నాయని తెలిపారు. వీరికి ఉపాధి రక్షణ కల్పించాలని కేంద్రం చట్టం చేసిందని, హాకర్ జోన్స్ ఏర్పాటు చేసి, ఎక్కడ వారికి అక్కడే ఉపాధి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ కూడా ఉన్నాయని తెలిపారు. అయినా నగరంలో పోలీసులు, జివిఎంసి అధికారులు దౌర్జన్యంగా చిరు వ్యాపారస్తులపై దాడులకు తెగబడటం సరికాదని పేర్కొన్నారు. జివిఎంసి మేయర్ జోక్యం చేసుకొని తొలగించిన బడ్డీలను, తోపుడుబండ్లను తిరిగి అవే ప్రదేశాలలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే తాము నిరసన కార్యక్రమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్ మిగులు భూములు నిర్వాసితులకివ్వాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను నిర్వాసితులకు కేటాయించాలని సిఎఫ్‌టియుఐ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్‌చేశారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 671వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐకి చెందిన సంప్రదాయ మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒప్పందం ప్రకారం నిర్వాసితులందరికీ ఆర్. కార్డులు ఇచ్చి ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. అయితే ఈనాటికీ సుమారు 8,500 కుటుంబాలకు ఉపాధి కల్పించలేదన్నారు. కనుక వారి భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని, సొంత గనులను కేటాయించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టంచేశారు. ఈ దీక్షల్లో ఎం.లక్ష్మి, జి.దుర్గ, జి.అప్పయ్యమ్మ, ఎల్.ఎల్లయ్య, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సిపిఐ నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామాన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రాకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ సిపిఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, ఈ బడ్జెట్ కార్పొరేట్, పారిశ్రామిక వర్గాలకు వరంగా, సామాన్య మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజానీకానికి భారంగా ఉందని విమర్శించారు. దక్షణకోస్తా రైల్వేజోన్ ప్రకటించి 4 సంవత్సరాలు అవుతున్నా నేటికీ నిధులు కేటాయించలేదని, ప్రత్యేక ఒఎస్‌డిని నియమించినప్పటికీ ఎలాంటి అతీగతీ లేదని వాపోయారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్, కె.సత్యనారాయణ, జి.రాం బాబు, పి.చంద్రశేఖర్ నాయకులు ఎం.మన్మధరావు, యు.నాగరాజు, ఎస్ .మురళి, కె.వనజాక్షి, ఎ.దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -మాకవరపాలెం:మండలంలో తూటిపాల లో యువ క్రీడాకారులకు గాయకులు ఆడీగడ్డ సతీష్ వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని పెంపొందించేందుకు వివిధ గ్రామాలల్లో ఎంపిక చేసిన యువతకు వాలీబాల్ కిట్లు అందిస్తున్నామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సేవా భావంతో ముందుకెళుతూ చదవుతుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

త్వరితంగా సంపద తయారీ కేంద్రం పనులు

జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషా రాణి సందర్శించారు. షెడ్డు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. షెడ్డు నిర్మాణానికి సంబంధించి మిగిలి ఉన్న పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. నక్కపల్లి సంపద తయారీ కేంద్రాన్ని శిక్షణ కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. సంపద తయారీ,నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



పనులపై ఆరాతీస్తున్న డిపిఒ